ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


శివలాల్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్

అబిడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తామని మంగళ్‌హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ పేర్కొన్నారు. శివలాల్‌నగర్ అర్జున్‌బాగ్ బాడా ప్రాంతాల్లో ఆమె పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరమేశ్వరీ సింగ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతుందన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి గోషామహల్ నియోజకవర్గం సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు పాటు పడుతానన్నారు. ఈ కార్యక్రమంలో శశిరాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


బ్యాడ్జీ ధరింపజేస్తున్న మిలటరీ అధికారి రాజేంద్రప్రసాద్


మురాద్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో..

గోల్కొండ: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని హెచ్.ఎస్.గ్రేవాల్ అన్నారు. మంగళవారం మురాద్‌నగర్‌లోని రవీంద్రభారతీ పాఠశాలలో నూతనంగా ఎన్నుకోబడిన విద్యార్థి క్యాబినేట్ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థి క్యాబినేట్‌కు ప్రమాణపత్రాలతో పాటు బ్యాడ్జీలు అందజేశారు. రవీంద్ర భారతీ పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియామనీష్, డీన్ మధు, రాజ్యలక్ష్మి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజయనగర్‌కాలనీ రవీంద్రభారతి పాఠశాలలో..

విజయనగర్‌కాలనీ: పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మిలటరీ మేజర్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. విజయనగర్‌కాలనీ రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై క్లాస్ లీడర్‌గా ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. రవీంద్రభారతి విద్యాసంస్థల డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపాల్ నూరీన్ ఫాతీమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'టెక్నాలజీలతో వ్యవసాయ రంగంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు'



గోల్కొండ: శాస్త్ర, సాంకేతిక రంగాల వారు ఆధునీక టెక్నాలజీలతో పరిశోధనలు చేస్తే వ్యవసాయ రంగంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చునని షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంపై జీఎన్ఐటీఎస్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం జీఎన్ఐటీఎస్‌లో ఒప్పంద పత్రాలను ఒకరికి ఒకరు ఇచ్చుకున్నారు. డాక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతిక పరికరాలు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇంజినీరింగ్ విభాగం వారు తమ తోడ్పాటును అందించేందుకు ఈ అవగాహన ఒప్పందం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ పి.రఘురామిరెడ్డి, జీఎన్ఐటీసీఎస్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన ఊరేగింపునకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలి


బీబీకా అలవాలోని అలంలకు దట్టీలు సమర్పిస్తున్న కార్పొరేటర్ సమీనా బేగం

యాకుత్‌పురా: తలాబ్‌చంచలం కార్పొరేటర్ సమీనా బేగం మంగళవారం బీబీ కా అలవాను సందర్శించి అలంలకు పూలు, దట్టీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీబీ కా అలవా అలంల ప్రధాన ఊరేగింపునకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

అలావాను సందర్శించిన వీహెచ్

డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా డబీర్‌పురా బీబీకా అలావాను మంగళవారం మాజీ ఎంపీ వి.హనుమంత్‌రావుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలంలకు పూలు, దట్టీలను సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలావా ముతవల్లీ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.



దంత సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


మాట్లాడుతున్న డాక్టర్ అరుణ

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా దంత వైద్య శాలలో కార్పొరేట్‌లకు దీటుగా నాణ్యమైన వైద్య సేవలు అందజేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అరుణ అన్నారు. ఇటీవలే రూ.85 లక్షలతో అత్యాధునికమైన ఎక్స్‌రే యంత్రాన్ని రోగుల సౌలభ్యం కోసం అందుబాటులోకి తీసుకువచ్చామని ఆమె వివరించారు. తాను ఇదే కళాశాలలో బీడీఎస్ వైద్య విద్యార్థినిని అని, నిరంతర కృషితో ప్రిన్సిపాల్ స్థాయిలో ఎదిగానన్నారు. దంతవైద్య విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు, సిబ్బంది సమస్యల సత్వర పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి రెండున్నేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఆమె మంగళవారం మీడియాతో ముచ్చటించారు. రోడ్డు ప్రమాదాలు, కాలిన గాయాలు, వృద్ధాప్యం, అధిక రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడే రోగులకు అమర్చే కృత్రిమ దంతాలు (సిరామిక్ ల్యాబ్) అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. టెక్నీషన్ల కొరత కారణంగా ఆ సర్వీసుల్ని పూర్తి సాయిలో వినియోగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంగా చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సిబ్బంది హాజరును బయోమెట్రిక్ పద్ధతిలో కచ్చితమైన నిబంధనలు పాటించమని చెప్పడంతో వైద్యులు, సిబ్బంది తనపై కక్ష కట్టి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాటిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ వెల్లడించారు.

వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించాలి


సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రాజేష్‌కుమార్, సీటీఓలు

అఫ్జల్‌గంజ్: బేగంబజార్ పరిసర ప్రాంతాల వ్యాపారులంతా సకాలంలో వాణిజ్య పన్నుల శాఖకు పన్నులు చెల్లించాలని వాణిజ్య పన్నుల శాఖ చార్మినార్ డివిజన్ జాయింట్ కమిషనర్ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. సిద్దిఅంబర్‌బజార్ రాజధాని హోటల్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ..వాణిజ్య పన్నుల శాఖలో స్ట్రీట్ సర్వే ప్రారంభించామన్నారు. ఈ సర్వే ద్వారా డీలర్‌షిప్‌లు లేని వారికి లైసెన్సులు ఇస్తున్నామన్నారు. గోడౌన్లకు కూడా లైసెన్సులు లేనిచో వెంటనే తీసుకోవాలన్నారు. ఏ డీలర్‌కైనా వాణిజ్య పన్నుల శాఖ జీఎస్‌టీ లైసెన్సు లేనిచో వెంటనే జారీ చేస్తున్నామన్నారు. అదేవిధంగా జీఎస్టీ డీలర్లు అంతా సకాలంలో వాణిజ్యపన్నుల శాఖకు పన్నులు చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు అవినాష్ దేవుడా, శ్రీరామ్‌వ్యాస్ మాట్లాడుతూ..వ్యాపారులందరికీ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీటీఓలు వెంకటేశ్వర్లు, ప్రకాష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ఊరేగింపునకు భారీ బందోబస్తు

దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ స్నేహ మెహ్రా

చార్మినార్: మొహర్రం సంతాప దినాల సందర్భంగా బుధవారం పాతబస్తీ వీధుల్లో నిర్వహించే పదో మొహర్రం సామూహిక ఊరేగింపునకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా అన్నారు. సామూహిక ఊరేగింపు పురస్కరించుకొని మంగళవారం రాత్రి సంబంధిత పోలీస్ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించి బందోబస్తుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దక్షిణ మండలం పోలీసులతో పాటు అదనపు బలగాలను రంగంలోకి దించామన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, మీర్ చౌక్ ఏసీపీ వెంకటేశ్వరరావు, రెయిన్ బజార్, మీర్ చౌక్ పోలీస్ స్టేషన్లకు చెందిన ఇన్‌స్పెక్టర్లు, డీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

మొహర్రం సందర్భంగా పాతబస్తీలో నిర్వహించే బీబీ కా ఆలం సామూహిక ఊరేగింపును పురస్కరించుకొని బుధవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నట్లు నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ పి.విశ్వప్రసాద్ తెలిపారు. ఊరేగింపు సందర్భంగా వాహనదారులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కొన్నిచోట్ల దారి మళ్లింపులు కొనసాగుతాయన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

- సునార్‌గల్లి 'టీ'జంక్షన్ వద్ద బీబీ-కా-అలావా వైపు వాహనాల ట్రాఫిక్ అనుమతించబడదు. వీటిని డబీర్‌పురా దర్వాజా, గంగా నగర్ నాలా, యాకుత్‌పురా వైపు మళ్లించబడుతుంది.
- షేక్ ఫైజ్ కమాన్ వైపు వాహనాల ట్రాఫిక్ అనుమతించబడదు. అవసరాన్ని బట్టి జబ్బార్ హోటల్ వద్ద డబీర్‌పురా దర్వాజా లేదా చంచల్‌గూడ వైపు మళ్లించబడుతుంది.
- ఎతేబార్ చౌక్ నుంచి వచ్చే వాహనాల ట్రాఫిక్ బడా బజార్ వైపు అనుమతించబడదు. వీటిని ఎతేబార్ చౌక్ వద్ద కోట్లా అలీజా, పురానా హవేలీ వైపు అవసరం మేరకు దారి మళ్లించబడుతుంది.
- ప్రధాన ఊరేగింపు గంగా నగర్ నాలా, యాకుత్‌పురాకు చేరుకున్నప్పుడు, పురాణీ హవేలీ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఎతేబార్ చౌక్ వైపు అనుమతించరు. పురానీ హవేలీ వద్ద చెత్తా బజార్, డబీర్‌పురా, ఎస్ జే రోటరీ వైపు మళ్లించబడుతుంది.
- ఊరేగింపు గంగా నగర్ నాలాకు చేరుకున్నప్పుడు, మొఘల్‌పురా, వోల్గా హోటల్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఎతేబార్ చౌక్ వైపు అనుమతించరు. పరిస్థితిని బట్టి బీబీ బజార్ ఎక్స్ రోడ్‌ల నుంచి ప్యారిస్ కేఫ్, తలాబ్ కట్ట వైపు మళ్లిస్తారు.
- ఊరేగింపు ఎతేబార్ చౌక్‌కు చేరుకున్నప్పుడు, మిట్టి-కా-షేర్, మదీనా నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఎతెబార్ చౌక్ వైపు అనుమతించరు. వీటిని గుల్జార్‌హౌస్ వద్ద మదీనా, మిట్టి-కా-షేర్ వైపు మళ్లించబడుతుంది.
- ఊరేగింపు కోట్లఅలీజాకు చేరుకున్నప్పుడు, మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను చౌక్ మైదాన్ ఖాన్ వైపు అనుమతించరు. వీటిని హఫీజ్ డంకా మసీదు వద్ద పారిస్ కేఫ్, బీబీ బజార్ వైపు అవసరాన్ని బట్టి మళ్లిస్తారు.
- ఊరేగింపు చార్మినార్ చేరుకున్నప్పుడు, షక్కర్‌కోట్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను గుల్జార్ హౌస్ వైపు అనుమతించరు. మిట్టి-కా-షేర్ జంక్షన్ వద్ద ఘాన్సీ బజార్, చెలాపురా వైపు మళ్లించబడుతుంది.
- ఊరేగింపు చార్మినార్ చేరుకున్నప్పుడు, నయాపూల్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను చార్మినార్ వైపు అనుమతించరు. మదీనా ఎక్స్ రోడ్ వద్ద సిటీ కాలేజీ వైపు మళ్లిస్తారు.
- ఊరేగింపు మీరాలం మండికి చేరుకున్నప్పుడు, చాదర్‌ఘాట్ రోటరీ, నూర్ఖాన్ బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం, శివాజీ బ్రిడ్జ్ నుండి వచ్చే ట్రాఫిక్‌ను పురాణీ హవేలీ వైపు అనుమతించరు. సాలార్‌జంగ్ రోటరీ వద్ద నయాపూల్, శివాజీ బ్రిడ్జ్, నూర్ఖాన్ బజార్ వైపు మళ్లిస్తారు.
- ఊరేగింపు అలవా సర్తాక్‌కు చేరుకున్నప్పుడు, చాదర్‌ఘాట్ రోటరీ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను కాలీ ఖబర్ వైపు అనుమతించరు. చాదర్‌ఘాట్ రోటరీ వద్ద రంగ్ మహల్, కోఠి వైపు చాదర్‌ఘాట్ వంతెన మీదుగా మళ్లిస్తారు.
- గౌలిగూడ, అఫ్జల్‌గంజ్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను సాలార్ జంగ్, శివాజీ బ్రిడ్జ్ వైపు అనుమతించరు. గౌలిగూడ వైపు సాలార్ జంగ్, శివాజీ బ్రిడ్జ్ ప్రవేశద్వారం వద్ద అఫ్జల్ గంజ్, గౌలిగూడ వైపుల మళ్లించబడుతుంది.
- ఊరేగింపు అలావా సర్తాక్‌కు చేరుకున్నప్పుడు ట్రాఫిక్‌ను ఎస్ జే రోటరీ వైపు అనుమతించరు. నయాపూల్ వద్ద మదీనా వైపు మళ్లించబడుతుంది,
- ఇక ఆర్టీసీ జిల్లా బస్సులు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రవేశం, నిష్క్రమణ కోసం రంగ్ మహల్, అఫ్జల్‌గంజ్ వైపు మళ్లించబడతాయి. ఊరేగింపు వచ్చే వరకు కాళికాబర్, మీరాలం మండి రహదారి పైకి రావడానికి అనుమతించబడతాయి.

త్వరలో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు

దూద్‌బౌలి: పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో త్వరలో సంతాన సాఫల్య కేంద్రం (ఐవీఎఫ్) ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజిని రెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె ఆసుపత్రిలో విలేకర్లతో మాట్లాడుతూ.. సంతాన సాఫల్య కేంద్రంతో పాటు టెలి మెడిసన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఇందుకోసం పూర్తి ఏర్పాట్లను సిద్ధం చేశామని రోగులకు ఆన్‌లైన్ ద్వారా సమాచారం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతిరోజు 2 నుంచి 3 గంటల వరకు ఒక డాక్టర్ అందుబాటులో ఉంటారని ఆమె వివరించారు. రోగులకు అవసరమైన మందులు ప్రభుత్వం ద్వారా వచ్చినవి ఉచితంగా అందిస్తున్నామని బయటి నుంచి ఎలాంటి మందులు కొనుగోలు చేస్తలేమని ఆమె తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నేరాలకు పాల్పడిన ఐదుగురికి జైలు

నాంపల్లి: వేర్వేరు ఘటనల్లో నేరాలకు పాల్పడిన ఐదుగురికి పదకొండవ స్పెషల్ ఎంఎంఎం కోర్టు జైలు వేసింది. హ్యుమయూన్‌నగర్‌కు చెందిన మహ్మద్ అక్బర్ కుమారుడు మహ్మద్ అర్బాజ్(22), మాసాబ్‌ట్యాంక్ ప్రాంతానికి చెందిన సయ్యద్ తాహెర్ కుమారుడు సయ్యద్ ముఖరం (22), ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఇబ్రహీం ఖురేషీ కుమారుడు గౌస్ ఖురేషీ(22)లపై నాంపల్లి పోలీసులు ఈ-పెట్టీ కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కాగా వీరికి ఒక్కొక్కరికి ఒక రోజు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు. అదే విధంగా కంచన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ అక్బర్ కుమారుడు మహ్మద్ అర్బాజ్ (22)కు రెండు రోజుల జైలు శిక్ష, ఐదు వేలు జరిమానా వేశారు. అలాగే మెహిదీపట్నం ప్రాంతానికి చెందిన సందీప్ అగర్వాల్ కుమారుడు కుషాల్ అగర్వాల్(22)కు మూడు రోజుల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు నాంపల్లి శాంతిభద్రతల ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తెలియజేశారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

నాంపల్లి: ముగ్గురు బైక్ దొంగలను హబీబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం ..మల్లేపల్లి అఫ్జల్‌సాగర్ ప్రాంతానికి చెందిన కాంబ్లే విశాల్(20), అబ్దుల్ రెహమాన్(19), సయ్యద్ అబ్బాస్ అలీ(19) ముగ్గురు బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతూ జల్సాలు చేసుకుంటున్నారు. దొంగలించిన బైకులను సయ్యద్ అబ్బాస్ అలీ ఇంట్లో ఉంచి అక్కడి నుంచి కింగ్‌కోఠి మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటారు. ఇలా వీరిపై హబీబ్‌నగర్‌తో పాటుగా రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో నేరాలు చేశారు. మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతుండగా హబీబ్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌లను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



నాంపల్లి: సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో నూతన విద్యార్థినులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు వివిధ రకాల కార్యక్రమాలతో స్వాగతం పలికి ఉత్సాహాన్ని నింపారు. ముఖ్యఅతిథిగా హాజరైన మోటివేషనల్ స్పీకర్ దర్పణ్ వాసుదేవ హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్పణ్ వాసుదేవ మాట్లాడుతూ.. విద్యార్థి సంస్కారవంతమైన విద్య పొందాలంటే కళాశాల గురువుల బాధ్యతతో పాటు, తల్లిదండ్రుల బాధ్యత, విద్యార్థుల బాధ్యత తప్పనిసరి అని తెలియజేశారు. అనంతరం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శాస్త్రీయ నృత్యాలు, జానపద, గిరిజన నృత్యాలతో పాటుగా కొన్ని హాస్య వల్లరులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ గౌలమారి పుష్పలీల, ఇతర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అమరేందర్ రెడ్డికి పీహెచ్‌డీ పట్టా అందజేత


డాక్టర్ అమరేందర్ రెడ్డికి పీహెచ్‌డీ పట్టా అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, జానారెడ్డి

అబిడ్స్: సీఎం రేవంత్‌రెడ్డిని న్యాయపరమైన, నైతికపరమైన అంశాలపై పీహెచ్‌డీ డాక్టరేట్ పొందిన డాక్టర్ అమరేందర్‌రెడ్డి కలిశారు. మాజీ రాష్ట్ర మంత్రి జానారెడ్డితో కలిసి ముఖ్యమంత్రిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా అమరేందర్‌రెడ్డికి డాక్టరేట్ పట్టాను ముఖ్యమంత్రి అందజేసి అభినందించారు. ఇలాంటి పరిశోధనలు మరిన్ని అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కృత్రిమ మేధా ద్వారా వచ్చే పరిణామాలు తీవ్రతరంగా ఉన్నందునా ఇలాంటి అంశాలపై మరింత లోతుగా పరిశోధనలు చేయాలన్నారు. డాక్టర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ..సామాజిక, న్యాయమైన 16 అంశాలు పరిశోధన పత్రాలు తాను రాశానని అవి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమయ్యాయన్నారు. అంతర్జాతీయ సాంకేతిక చట్టాలను ఏర్పాటు చేయాలనే అంశంపై పీహెచ్‌డీ పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

సదరం క్యాంప్ విజయవంతం


సదరం క్యాంప్‌లో డాక్టర్ మజహరుల్లా, డాక్టర్ క్రాంతి తదితరులు

గోల్కొండ: దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో సదరం క్యాంపు ఏర్పాటు చేసిందని గోల్కొండ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహరుల్లా అన్నారు. మంగళవారం ఆయన సదరం క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ క్రాంతికిరణ్ తోటి వైద్యులతో కలిసి క్యాంపునకు వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలో అంగవైకల్యం ఉంటే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. క్యాంపునకు వచ్చే వారు ముందుగానే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోని టోకెన్ తెచ్చుకోవాలని సూచించారు.

జూ సిబ్బందికి పాములపై శిక్షణ



బహదూర్‌పురా: నేడు ప్రపంచ పాము దినోత్సవం సందర్భంగా జూ సిబ్బందికి పాము కాటు నివారణ పద్ధతులు, పాములపై అవగాహన కల్పించారు. దాదాపు 300 మంది జూ సిబ్బంది జంతు విభాగం, గార్డెన్ సెక్షన్, సెక్యూరిటీ సెక్షన్‌లు కలిగి ఉన్నారు. డాక్టర్ సునిల్, ఎస్.హీరేమత్ మార్గదర్శకత్వంలో ఐఎఫ్ఎస్, డైరెక్టర్(ఎఫ్ఏసీ), క్యూరేటర్, ఎ.నాగమణి, డిప్యూటీ క్యూరేటర్, దీపక్ తరుణ్ ఎడ్యుకేషన్ అధికారి ఈఓ, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. భారతదేశంలో కనిపించే విధంగా రకరకాల పాముల గురించి పర్యావణ సమతుల్యతను కాపాడుకోవడంలో వాటి పాత్ర గురించి వివరించారు.

శ్రీనివాసాచార్యులకు అర్చక పురస్కారం

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు నల్లదీగల శ్రీనివాసాచార్యులకు అర్చక పురస్కారం లభించింది. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో సృజన ఆర్ట్స్ క్రియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు శ్రీమాన్ సముద్రాల వేణుగోపాల ఆచార్యుల చేతుల మీదుగా అర్చక పురస్కారాన్ని అందుకున్నారు. అర్చక పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా శ్రీనివాసాచార్యులకు ఆలయ చైర్మన్ కె.యుగేందర్ రెడ్డి, భక్తులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



21న గురు పూర్ణిమ మహోత్సవాలు

గౌలిపురా: గౌలిపురా లాల్‌దర్వాజాలోని దత్త సాయి మందిరంలో ఈనెల 21న గురు పూర్ణిమ మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి దత్త ప్రసాద్ దీక్షిత్ తెలిపారు. ఉదయం 5 గంటలకు సాయిబాబాకు అభిషేకం, 7 గంటలకు దత్తాత్రేయ స్వామి అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మహా ప్రసాదం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు.

ఆకట్టుకున్న 'పాటే నా ప్రాణం'


గోపీకృష్ణ దంపతులను సన్మానిస్తున్న కోటి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మనీష కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాటే నా ప్రాణం పేరుతో మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించిన సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రముఖ సినీ సంగీత దర్శకుడు కోటి మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా సంగీత ప్రయాణాన్ని కొనసాగించడం, ఆ ప్రయాణాన్ని వేదికపై ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పలువురు గాయకులను సన్మానించారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు ఎ.కోదండరామిరెడ్డి, నటుడు తనికెళ్ల భరణి, సరస్వతి, ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు గోపాల్, సంస్థ అధ్యక్షుడు మధుబాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గోల్కొండ: ముసైదుకుర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది. ఈ పాఠశాలలో పదవ తరగతి చదివి వివిధ రంగాల్లో పని చేస్తున్న వారంతా ఒకే వేదికపై కలిశారు. ఈ సందర్భంగా వారు గురువులకు పాదాభివందనం చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పత్రిక రంగంలో స్థిరపడిన కేమోజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. దశాబ్దాల తర్వాత ఈ విధంగా ఒకే వేదికపైకి వచ్చి ఎలా ఉన్నావురా అని పలకరించుకోవడం జీవితంలో మరచిపోలేని అనుభూతి అని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు సుందర్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉమారాణి, నారాయణ తదితరులున్నారు.

సుభాన్‌పురాలో 'అమ్మ మాట..అంగన్‌వాడీ బాట'



అబిడ్స్: దారుసలాం సుభాన్‌పురాలో 'అమ్మ మాట..అంగన్‌వాడీ బాట'కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ అనిత ఆధ్వర్యంలో బస్తీలో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ఉంటుందని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ..పిల్లలకు విద్యను అందించేందుకు 'అమ్మ మాట..అంగన్‌వాడీ బాట'కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఇంటింటా తిరుగుతూ..బడికిరాని పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యను బోధించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

రేణుకాఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో కర్ర పూజ


పూజ చేస్తున్న సాకెళ్ల సర్వేశ్, శ్రీనివాస్

గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిపురా పటేల్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం కర్ర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాకెళ్లి సర్వేశ్, అధ్యక్షుడు కాలే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జి.కృష్ణ, బస్తీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, ఆర్గనైజర్ సెక్రటరీ డి.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'రుణమాఫీ అయిన వెంటనే హరీష్‌రావు రాజీనామా చేయాలి'


గౌరీ సతీష్

అబిడ్స్: రైతులకు రుణమాఫీ అయిన వెంటనే మాజీ మంత్రి హరీష్‌రావు రాజీనామా చేయడానికి గన్‌పార్కు వద్ద సిద్ధంగా ఉండాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చెప్పిన విధంగా రుణమాఫీ చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానని హరీష్‌రావు గత నెలలో గన్‌పార్కు వద్ద ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. చేసిన ప్రకటనకు కట్టుబడి తన నిజాయితీని చాటుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించిందని గుర్తు చేశారు. పదేళ్లపాటు మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు.

బోనాలకు నిరంతర నీటి సరఫరా కొనసాగించాలి


వినతిపత్రం అందజేస్తున్న దీపేష్ రాజ్ వర్మ

చార్మినార్: బోనాలకు నిరంతర నీటి సరఫరా కొనసాగించాలని మజ్లిస్ పార్టీ ఓబీసీ విభాగం ఇన్‌చార్జి ఆర్.దీపేష్ రాజ్ వర్మ జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అధికారికంగా రాసిన వినతి పత్రాన్ని మంగళవారం మేనేజింగ్ డైరెక్టర్‌కు అందజేసినట్లు ఆయన తెలిపారు. బోనాల ఉత్సవాల్లో అన్ని ఆలయాల వద్ద మురుగు నీటి సమస్య ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరినట్లు దీపేష్ రాజ్ వర్మ పేర్కొన్నారు.